TG TEL/25/A1234
www.kakatiyanews.com
ఉత్తరం
# కాకతీయ
మంగళవారం, 27 అక్టోబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 63 | పేజీలు: 5 వెల: 5

# కరువును వదిలి ఢిల్లీ పర్యటనలా?

## ఖర్గే వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం

- ఓటర్ల ప్రత్యేక సవరణపై కాంగ్రెస్‌ది అసత్య ప్రచారం
- కొండారెడ్డిపల్లిలో ఓట్ల తొలగింపును చూపించాలి
- రాష్ట్రంలో తాగునీటి సంక్షోభాన్ని పట్టించుకోని సీఎం
- నవంబర్ 2న 'లోక్‌తంత్ర బచావో–అరాచకత హఠావో' పాదయాత్ర
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ప్రధాని నరేంద్ర మోదీ తల్లిదండ్రులపై కాంగ్రెస్ నాయకులు ఉపయోగిస్తున్న అభ్యంతరకర భాష ఆ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. రాష్ట్రంలో కరువు, తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నా వాటిని పట్టించుకోకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు. ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోందని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించినట్లు ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

........(తరువాయి 2లో)



# తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్ర సానుకూలం!

## 152 మీటర్ల ఎత్తు ప్రతిపాదనపై పునఃపరిశీలనకు సీఎం ఫడ్నవీస్ అంగీకారం

- మహారాష్ట్రకు నష్టం లేకుంటే 148 మీటర్ల ఒప్పందంపై పునరాలోచన
- గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు 152 మీటర్ల ఎత్తు అవసరం
- ముంపు భూములకు పరిహారం చెల్లిస్తామన్న తెలంగాణ ప్రభుత్వం
- అధ్యయనానికి రెండు రాష్ట్రాల అధికారులతో కమిటీ ప్రతిపాదన
- ఆదిలాబాద్ గిరిజనుల సాగు, తాగునీటి అవసరాలపై రేవంత్‌రెడ్డి వినతి



**కాకతీయ,తెలంగాణ బ్యూరో:** ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను పునఃపరిశీలించేందుకు సిద్ధమని, మహారాష్ట్రకు, అక్కడి ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని నిర్ధారణ అయితే 148 మీటర్ల ఎత్తుకు సంబంధించిన గత ఒప్పందంపై పునరాలోచించేందుకు

........(తరువాయి 2లో)

# ఇసుక తవ్వకాలపై సుప్రీం బ్రేక్!

## ములుగు జిల్లాలో ఇసుక తవ్వకాలపై స్టే

- ఎన్జీటీలోనే తేల్చుకోవాలని టీజీఎండీసీకి ఆదేశాలు
- డీసిల్టింగ్ వ్యవహారంలో సివిల్ అప్పీల్ డిస్మిస్
- నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలపై గతంలో ఎన్జీటీ ఆగ్రహం
- సీతమ్మసాగర్ ప్రాజెక్టు పరిధిలో డీసిల్టింగ్‌కు అనుమతులకు నిరాకరణ
- ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని ఇటీవల ట్రిబ్యునల్ ఆదేశాలు
- తాజా పరిణామాలతో కాంట్రాక్టర్లు, అధికారుల్లో ఉత్కంఠ





5

# మెడికవర్‌పై ఉన్న శ్రద్ధ.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులపై ఏదీ?



- 17 వేల మంది ఉద్యోగుల సమస్యలు పట్టించుకోరా?
- 14 రోజులుగా సమ్మె చేస్తున్నా స్పందన కరువు
- ఉద్యోగ భద్రత, పే స్కేల్, ఆరోగ్య బీమా కల్పించాలి
- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

2



# ఓటు చోరీపై సమరభేరి!

- నవంబర్ 1న ఢిల్లీ నిరసనకు సన్నాహాలు
- గల్లీగల్లీలో ఓటు హక్కుల పరిరక్షణ ఉద్యమం
- ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు

2

# రేడియల్ రోడ్ టెండర్లలో అక్రమాలు

- రోడ్-2 ప్రాజెక్టులో ఆర్థిక అవకతవకలు జరిగాయి
- బినామీలకు కాంట్రాక్టర్లకు దక్కడంపై విచారణ జరపాలి
- ఈడీకి మాజీ ఏపీసీసీ అధ్యక్షుడు బక్కా జడ్సన్ ఫిర్యాదు
- రూ.3,296 కోట్ల పనులపై అనేక ప్రశ్నలు లేవనెత్తిన నాయకుడు



2

# కాంగ్రెస్ తెచ్చిన కరువు!

## దేవాదుల, కల్వకుర్తి నుంచి ఎందుకు నీళ్లు ఎత్తడం లేదు?



- తమ్మిడిహట్టి నీటి లభ్యతపై కేంద్రం మూడు లేఖలు ఇచ్చింది
- మేడిగడ్డకు మరమ్మతులు చేయకుండా మూడేళ్లుగా కాలయాపన
- ఎన్ని నీళ్లు ఎత్తారో శ్వేతపత్రం విడుదల చేయాలి
- గ్రావిటీ ద్వారా నీళ్లు తెస్తారా? ఉత్తమ్‌కు హరీశ్‌రావు సవాల్

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. పట్టిసీమ ద్వారా ఆంధ్రప్రదేశ్ నీటిని ఎత్తుతుంటే తెలంగాణలో దేవాదుల, కల్వకుర్తి ప్రాజెక్టుల నుంచి నీటిని ఎందుకు ఎత్తడం లేదని ప్రశ్నించారు. ఏ ప్రాజెక్టులో ఎన్ని మోటార్లు నడిపారు, ఎన్ని గంటలు పంపింగ్ చేశారు, ఎంత నీటిని ఎత్తిపోశారో పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీకి వెంటనే మరమ్మతులు చేసి కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తాలని కోరారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టు నుంచి ఎన్ని రోజులు, ఎన్ని గంటలు నీటిని ఎత్తారో ప్రభుత్వం వెల్లడించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కల్వకుర్తి ప్రాజెక్టులోనూ ఐదు మోటార్లలో రెండు మాత్రమే నడుస్తున్నాయని, 12 గంటలు నడిపి 12 గంటలు నిలిపివేస్తున్నారని ఆరోపించారు. శ్రీశైలంలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ఎందుకు ఎత్తడం లేదని ప్రశ్నించారు. దేవాదుల ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నడిపి ఉంటే వరంగల్ జిల్లాతో పాటు కరీంనగర్‌లోని కొంత ప్రాంతం సస్యశ్యామలంగా మారేదన్నారు. పక్క రాష్ట్రంలో పంటలకు సెలవు ప్రకటించని పరిస్థితుల్లో తెలంగాణలో క్రాప్ హాలిడే ఎందుకు

........(తరువాయి 2లో)



# సీసీఐ కోసం కోట్ల కుట్ర

## రైతు ధరను తొక్కేసే ప్లాన్!

- ధర తగ్గితేనే సీసీఐ వస్తుంది..
- సీసీఐ వస్తేనే మిల్లర్లకు కోట్ల లాభం
- ఏనుమాములలో తెరవెనుక జరుగుతున్న దందా ఇదే!

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** రైతుకు ఎక్కువ ధర ఇస్తే కడుపు మండుతున్న కొందరు జిన్నింగ్ మిల్లర్లు సీసీఐని అడ్డం పెట్టుకుని కోట్ల రూపాయలు కొల్లగొట్టేందుకు పక్కా ప్లాన్ వేశారు. ఇందులో భాగంగానే రైతుకు ఎక్కువ ధర ఇస్తున్న కమీషన్ ఏజెంట్లను బెదిరింపులకు గురిచేస్తున్నారనే

........(తరువాయి 2లో)

# తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్ర సానుకూలం!



(మొదటిపేజీ తరువాయి)
అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమైంది. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, సాంకేతిక అంశాలపై ఇరు రాష్ట్రాల మధ్య కీలక చర్చలు జరిగాయి. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు, తాగునీటి సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, మహారాష్ట్రకు చెందిన ఎస్.బి. చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి ఈ ప్రాజెక్టుపై వివిధ దశల్లో చర్చలు కొనసాగుతున్నాయని సమావేశంలో తెలంగాణ బృందం వివరించింది. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రాజెక్టు ముందుకు సాగలేదని పేర్కొంది. 2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిన విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రస్తావించారు. అయితే, ఆ ఎత్తుతో నిర్మాణం చేపడితే తెలంగాణ ప్రాంతానికి అవసరమైన తాగు, సాగునీటిని పూర్తిస్థాయిలో అందించడంలో పరిమితులు ఉంటాయని వివరించారు. అందువల్ల ప్రాజెక్టు ఎత్తును 152 మీటర్లకు పెంచే ప్రతిపాదనను పరిశీలించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

**గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు ప్రాధాన్యం**

సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రాజెక్టు నిర్మాణం, నీటి తరలింపు విధానం, నిర్వహణ వ్యయం, విద్యుత్ వినియోగం వంటి అంశాలను మహారాష్ట్ర ముఖ్యమంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకుని ప్రాజెక్టును రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసే విధానంతో పోలిస్తే గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల దీర్ఘకాలంలో నిర్వహణ ఖర్చులు తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ నేపథ్యంలో బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచే ప్రతిపాదనకు ఉన్న సాంకేతిక, ఆర్థిక ప్రయోజనాలను వివరించారు. తెలంగాణ తాగు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రతిపాదనను పరిశీలించాలని కోరారు.

**ఆదిలాబాద్ గిరిజనుల సమస్యలను వివరించిన రేవంత్‌రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని వివరించారు. సుసంపన్నమైన చరిత్ర, ప్రత్యేకమైన సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఈ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిందని పేర్కొన్నారు. గిరిజనులు, ఆదివాసీలు ఇప్పటికీ సాగు, తాగునీటి వంటి ప్రాథమిక అవసరాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆర్థిక అవకాశాలు పరిమితంగా ఉండటం, అభివృద్ధి ఫలాలు అందకపోవడం వంటి సమస్యలను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని గుర్తుచేస్తూ, ఆదిలాబాద్ ప్రాంత ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్షలను నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో మార్పు తీసుకురావాలంటే సాగు, తాగునీటి సదుపాయాలు విస్తరించాల్సి ఉందని వివరించారు. వెనుకబడిన సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని కోరారు.

**ముంపు భూములకు పరిహారం చెల్లించేందుకు సిద్ధం**

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం వల్ల మహారాష్ట్రలో వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో, ప్రభావిత రైతులకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, పరిహార విధానం ప్రకారం చెల్లింపులు చేపట్టేందుకు సిద్ధమని తెలిపారు. అయితే, ముంపునకు గురయ్యే భూముల విస్తీర్ణం, ప్రభావిత ప్రాంతాలు, పరిహారం వంటి అంశాలపై సమగ్ర అధ్యయనం అవసరమని ఇరు రాష్ట్రాలు అభిప్రాయపడ్డాయి. మహారాష్ట్రకు, అక్కడి ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండకూడదన్న అంశాన్ని ఫడ్నవీస్ స్పష్టం చేశారు. సాంకేతిక, పర్యావరణ, పరిపాలనా పరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే బ్యారేజీ ఎత్తుపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

**152 మీటర్ల ప్రతిపాదనపై పునఃపరిశీలన**

తెలంగాణ ప్రతిపాదనపై స్పందించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్.. బ్యారేజీ ఎత్తును పెంచే అంశాన్ని మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మహారాష్ట్రకు, అక్కడి ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా ఉంటే 148 మీటర్ల ఎత్తుకు సంబంధించిన ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు అభ్యంతరం లేదన్నారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు అభ్యంతరం లేదని, అయితే అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ముందడుగు వేయాలని స్పష్టం చేశారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందని ఫడ్నవీస్ పేర్కొన్నారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. అంతర్రాష్ట్ర సమస్యలను చర్చలు, పరస్పర సహకారంతో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. జాతీయ ప్రయోజనాలు, రెండు రాష్ట్రాల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు.

**అధికారుల కమిటీతో తదుపరి కార్యాచరణ**

తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, పరిహారం, సాంకేతిక అంశాలపై సమగ్ర అధ్యయనం చేసేందుకు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. ఈ కమిటీ రెండు రాష్ట్రాల అంచనాలను పరిశీలించి, అవసరమైన సాంకేతిక వివరాలను సేకరించనుంది. ముంపు ప్రాంతాలు, ప్రభావిత భూముల విస్తీర్ణం, నీటి లభ్యతపై అధ్యయనం చేయడంతో పాటు అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా పరిశీలించనుంది. కేంద్ర జల సంఘం పరిధిలో అవసరమైన అధ్యయనాలు, సాంకేతిక పరిశీలనలు కొనసాగుతాయని సమావేశంలో ప్రస్తావించారు. అధికారుల కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్చలు, సమావేశాల కాలపరిమితులు, ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలనే అభిప్రాయం వ్యక్తమైంది.

**విమానాశ్రయంతో సరిహద్దు ప్రాంతాలకు ప్రయోజనం**

ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికీ ఊతం లభిస్తుందని రేవంత్‌రెడ్డి వివరించారు. రవాణా సదుపాయాలు మెరుగుపడటంతోపాటు ఆర్థిక కార్యకలాపాలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీని కేవలం సాగునీటి ప్రాజెక్టుగా కాకుండా రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి దోహదపడే ప్రాజెక్టుగా చూడాలని కోరారు. దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించి, సదస్సులో పాల్గొనేందుకు ప్రయత్నిస్తానని తెలిపినట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. తుమ్మిడిహెట్టి బ్యారేజీపై జరిగిన చర్చల్లో రెండు రాష్ట్రాల మధ్య సాంకేతిక అంశాల పరిశీలనకు, తదుపరి సంప్రదింపులకు మార్గం సుగమమైంది. అయితే, 152 మీటర్ల ఎత్తుపై తుది నిర్ణయం అధికారుల కమిటీ అధ్యయనం, ముంపు ప్రభావం, నీటి లభ్యత, ఇతర సాంకేతిక అంశాల పరిశీలన అనంతరం తీసుకోవాల్సి ఉంది.

# కరువును వదిలి ఢిల్లీ పర్యటనలా?

(మొదటిపేజీ తరువాయి)
కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాట్నా సభలో ప్రధాని మోదీ తండ్రిని ఉద్దేశించి అవమానకర వ్యాఖ్యలు చేయడం హేయమని రాంచందర్‌రావు అన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత విమర్శలకు దిగడం కాంగ్రెస్ నాయకత్వ వైఖరిని ప్రతిబింబిస్తోందని విమర్శించారు. ఈ వ్యాఖ్యలకు నిరసనగా హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మల దహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

**ఓట్ల తొలగింపుపై ఆధారాలు చూపాలి**

ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాంచందర్‌రావు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లికి తాను వస్తానని, అక్కడ అర్హులైన ఓటర్ల పేర్లు ఎక్కడ తొలగించారో చూపించాలని సవాల్ విసిరారు. ఎన్నికల సంఘం గైర్హాజరైనవారు, చిరునామా మారినవారు, మరణించినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు కలిగినవారి వివరాలను పరిశీలిస్తోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్ల తొలగింపు జరిగిందంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంపై ఆయన గణాంకాలు వెల్లడించారు. అయితే, ఈ సంఖ్యలు, వర్గాలవారీ వివరాలను ఎన్నికల సంఘం అధికారిక రికార్డులతో ధ్రువీకరించాల్సి ఉంది. రాష్ట్రంలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని రాంచందర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. 600కుపైగా మండలాల్లో దాదాపు 330 మండలాలు కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, రాష్ట్రంలోని సుమారు ఆరు వేల చెరువుల్లో 500 మాత్రమే నీటితో ఉన్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోనూ రోజుకు సుమారు ఎనిమిది వేల ట్యాంకర్ల ద్వారా ప్రజలు తాగునీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని అన్నారు. ప్రజలు నీటి సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే వాటి పరిష్కారంపై దృష్టి పెట్టకుండా రాహుల్ గాంధీని ప్రసన్నం చేసుకునేందుకు ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు.

**నవంబర్ 2న బీజేపీ భారీ పాదయాత్ర**

రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేస్తానంటూ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదమని రాంచందర్‌రావు అన్నారు. కాంగ్రెస్ రాజకీయ బలం తగ్గుతోందని, బీజేపీ బలం పెరుగుతోందని తన ప్రసంగంలో గణాంకాలను ప్రస్తావించారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ప్రచారానికే కాంగ్రెస్ ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. ఎన్నికల సంస్కరణలపై చర్చించాలంటే ఆధారాలతో మాట్లాడాలని సూచించారు. 'లోక్‌తంత్ర బచావో-అరాచకత హఠావో' నినాదంతో నవంబర్ 2న బీజేపీ ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు రాంచందర్‌రావు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై పాదయాత్రలో పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ అరాచక వైఖరిని ప్రజల్లో ఎండగట్టడమే లక్ష్యమని పేర్కొన్నారు.

**గోదావరి జలాలపై న్యాయమైన వాటా కావాలి**

గోదావరి ఉమ్మడి నది అని, గోదావరి నదీ యాజమాన్య బోర్డు ఇచ్చే నిర్ణయాలను రెండు తెలుగు రాష్ట్రాలు గౌరవించాలని రాంచందర్‌రావు అన్నారు. మేడిగడ్డ బ్యారేజీ నాణ్యత లోపాలకు గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల బాధ్యతారాహిత్యమే కారణమని విమర్శించారు. జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ మరమ్మతులను అడ్డుకోలేదని, రైతుల ప్రయోజనాల దృష్ట్యా పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. నీటి వివాదాలతో జిల్లాల మధ్య విభేదాలు సృష్టించకుండా, తెలంగాణలోని ప్రతి ప్రాంతానికి న్యాయబద్ధమైన నీటి వాటా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# బ్రిక్స్ వేదికపై తెలంగాణ గొంతు

- ఢిల్లీ సమావేశాలకు బయలుదేరిన శాసనసభాపతి
- రాష్ట్ర ప్రగతి, కీలక అంశాలపై వివరణ
- తెలంగాణ ఖ్యాతిని పెంచుతాం: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్




**కాకతీయ, హైదరాబాద్, అక్టోబర్ 26:** బ్రిక్స్ సమావేశాల వేదికపై తెలంగాణ గొంతును బలంగా వినిపిస్తామని శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతి, రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలను సమావేశాల్లో వివరిస్తామని తెలిపారు. ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొనేందుకు తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం ఉదయం శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ ప్రాధాన్యాన్ని చాటుతామని పేర్కొన్నారు. రాష్ట్ర ఖ్యాతిని మరింత పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. స్పీకర్ పర్యటన విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షించారు.

# సీసీఐ కోసం కోట్ల కుట్ర



(మొదటిపేజీ తరువాయి)
ఆరోపణలు ఏనుమాముల మార్కెట్ ను కుదిపేస్తున్నాయి. ఆసియాలోనే రెండో అతిపెద్ద పత్తి మార్కెట్ అయిన ఏనుమాములలో ఒక పెద్ద కుట్ర తెరవెనుక నడుస్తోంది. రైతు నోట్లో మట్టి కొట్టి, సీసీఐ పేరుతో కోట్లు దోచుకోవాలనే ప్లాన్ అది. అసలు కథ ఏంటంటే.. మౌళి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ చంద్రమౌళి, మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్, మా లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ వంటి కమీషన్ ఏజెంట్లు బయట రాష్ట్రాల వ్యాపారుల తరపున పత్తిని కొనుగోలు చేస్తున్నారు. వీరికి సొంత జిన్నింగ్ మిల్లులు లేవు. ఆర్డర్‌పై రైతుకు రూ.100200 ఎక్కువ ఇచ్చి కొంటున్నారు. దీంతో రైతుకు కొంత ఊరట లభిస్తోంది. ఇదే కొందరు స్థానిక జిన్నింగ్ మిల్లర్లకు కంట్లో నలుసుగా మారింది. ఇటీవల చంద్రమౌళి లూజు పత్తి కొనుగోలు చేస్తుండగా నువ్వు లూజు పత్తి ఎందుకు కొంటావు? బస్తాలే కొనాలి అంటూ ఓ మిల్లర్ వర్గం లొల్లికి దిగింది. నిజానికి లైసెన్స్ ఉన్న కమీషన్ ఏజెంట్ ఏ రూపంలో ఉన్న పత్తినైనా కొనొచ్చు. కానీ కావాలనే గొడవ సృష్టించి భయపెట్టాలని చూస్తున్నారు.

**సీసీఐని రప్పించే ఎత్తుగడ..**

ఎందుకు ఇలా చేస్తున్నారనే దాని వెనుక పెద్ద లెక్క ఉంది. మార్కెట్లో ధర ఎక్కువ ఉంటే సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) రాదు. ధర తక్కువ ఉంటేనే సీసీఐ వస్తుంది. సీసీఐ వచ్చి మద్దతు ధరకు కొనుగోలు మొదలుపెడితే, మార్కెట్ లో పత్తి ధర పడిపోతుంది. అప్పుడు మిల్లర్లు తక్కువ ధరకు కొని, సీసీఐ ద్వారా లేదా ఎగుమతుల ద్వారా కోట్ల లాభం పొందుతారు. అందుకే రైతుకు ఎక్కువ ధర ఇస్తున్న కమీషన్ ఏజెంట్లను మార్కెట్ నుంచి తరిమేస్తే, ధర ఆటోమేటిక్‌గా తగ్గుతుందని వారి అంచనా. దీనికోసం కోట్ల రూపాయల ఫండ్ కూడా సిద్ధం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**రైతు సంఘాలు ఏం చేస్తున్నాయి?**

ఇక్కడే అత్యంత విషాదం. ఇటీవల చిన్న మార్కెట్ అయిన భద్రాచలంలో క్వింటాల్ పత్తి రూ.10,600 పలుకగా, ఏనుమాములలో రూ.9110 మాత్రమే పలికింది. అంటే రూ.1500 తేడా. కాగా, సోమవారం కమ్మం మార్కెట్ లో 9100 పలుకగా, పెద్ద మార్కెట్ అయిన ఏనుమాములలో 8950 పలికింది. ఈ లెక్కన రూ. 50పైసలు తగ్గించారు. ఇలాంటి సమయంలో రైతు సంఘాలు ధర పెంచాలని పోరాడాలి. కానీ వారు ఎక్కువ ధర ఇస్తున్న వ్యాపారి దగ్గరకు వెళ్లి 100 గ్రాముల కాంటా తేడా అంటూ లొల్లి చేయడం వెనుక మిల్లర్ల హస్తం ఉందని రైతులే అనుమానిస్తున్నారు. ఎల్ నినో వల్ల ఎకరాకు 12 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి 5 క్వింటాళ్లకు పడిపోయి రైతు అప్పుల్లో ఉంటే, ఆదుకోవాల్సిన సంఘాలు వ్యాపారులకు వత్తాసు పలకడం దారుణం. ఒకప్పుడు రోజుకు లక్ష బస్తాలు వచ్చే ఏనుమాముల మార్కెట్ ఇప్పుడు అక్టోబర్ నెల మొత్తం కొడితే 50వేల బస్తాలు కూడా రాలేదనే చెప్పొచ్చు. 550 మంది లైసెన్స్ దారులు ఉన్నా, కొందరి దోపిడీ వల్ల మార్కెట్ ఉనికికే ప్రమాదం వచ్చింది. ఇప్పటికైనా మార్కెట్ కమిటీ, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రైతుకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

# మెడికవర్‌పై ఉన్న శ్రద్ధ.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులపై ఏదీ?

- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** మెడికవర్ ఆస్పత్రులను కాపాడటంపై ఉన్న శ్రద్ధ జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులను ఆదుకోవడంపై ఎందుకు లేదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలను కాపాడే 17 వేల మంది ఉద్యోగులు 14 రోజులుగా సమ్మె చేస్తున్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెలో పాల్గొని ఆయన మద్దతు తెలిపారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలందించిన ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డున పడేసిందని అన్నారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ జీతాలు పెంచి ఉద్యోగులను ఆదుకున్నారని, ప్రస్తుత ప్రభుత్వం కనీసం చర్చలకు కూడా పిలవడం లేదని విమర్శించారు.

**ఉద్యోగ భద్రత ఏదీ?**

జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, పే స్కేల్, ఆరోగ్య బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించడం లేదని ప్రవీణ్‌కుమార్ అన్నారు. ప్రసూతి సెలవులు కూడా అమలు కాకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల్లోనే కాకుండా ప్రైవేటు సంస్థల్లోనూ ప్రసూతి సెలవులు కల్పిస్తున్నారని, ఆరోగ్య శాఖ ఉద్యోగులకు ఆ సదుపాయం లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్ రూ.3 లక్షల కోట్లుగా ఉన్నప్పుడు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రూ.100 కోట్లు కేటాయించలేరా అని నిలదీశారు. 17 వేల మంది ఉద్యోగులకు ఆరోగ్య బీమా కల్పించేందుకు సుమారు రూ.17 కోట్లు సరిపోతాయని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం కంటే ఇతర నిర్మాణాలు, ఖర్చులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని విమర్శించారు.

**ఆరోగ్య రంగంలో కీలక సేవలు**

జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు తెలంగాణను ఆరోగ్య రంగంలో దేశంలో 11వ స్థానం నుంచి 3వ స్థానానికి తీసుకొచ్చారని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను 31 శాతం నుంచి 70 శాతానికి పెంచడంతోపాటు మాతా, శిశు మరణాల రేటును తగ్గించారని చెప్పారు. సుమారు 2.98 కోట్ల మందికి కంటి పరీక్షలు నిర్వహించి అంధత్వ రహిత రాష్ట్ర సాధనకు కృషి చేశారని వివరించారు. ఇంత సేవ చేసిన ఉద్యోగులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. తెలంగాణ అధికారులు హర్యానా, పంజాబ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్రల్లో పర్యటించి అక్కడ జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అనుసరిస్తున్న విధానాలను పరిశీలించాలని సూచించారు. ఆయా రాష్ట్రాల తరహాలో ఇక్కడి ఉద్యోగులను కూడా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తామని, అవసరమైతే అసెంబ్లీలో వారి తరఫున గళం వినిపిస్తామని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ఓటు చోరీపై సమరభేరి!

- మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు

**కాకతీయ, సికింద్రాబాద్:** ఓటు హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా చేపట్టిన 'ఓట్ బచావో-దేశ్ బచావో' ఉద్యమంలో తెలంగాణ గళాన్ని ఢిల్లీలో వినిపించాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న భారీ నిరసన కార్యక్రమం నేపథ్యంలో సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ నియోజకవర్గంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధమైన ఓటు హక్కే నేడు ప్రమాదంలో పడిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సంఘం బీజేపీకి అనుబంధ సంస్థలా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలను రాహుల్‌గాంధీ ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటు బిల్లుకు రాజ్యసభలో మద్దతు తెలిపిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అవినాష్ పాండేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలను ప్రశ్నిస్తే కేసులతో వేధిస్తున్నారని, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జున ఖర్గే, ఇండియా కూటమి ఎంపీల అరెస్టులతో ఉద్యమాన్ని అడ్డుకోలేరని పొన్నం అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 'ఓట్ చోరీ-గద్దీ ఛోడో' నినాదంతో పోరాటాన్ని గల్లీగల్లీకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఢిల్లీ నిరసనలో హైదరాబాద్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అవినాష్ పాండే, ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శి సచిన్ సావంత్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే శ్రీ గణేశ్, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్, ఇతర నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తు పై వెంటనే స్పందించిన జేసీ

- డీసీసీబీ బ్యాంక్ అధికారులపై జాయింట్ కలెక్టర్ ఆగ్రహం
- దళిత మహిళ కుటుంబం పట్ల నిర్లక్ష్యం వహించడం పై అసహనం వ్యక్తం చేసిన శ్రీజ
- 2 రోజుల్లో మాటికేజ్ లోన్ రిపోర్ట్ అందించాలని సీఈఓ కి ఆదేశం



**కాకతీయ, ఖమ్మం బ్యూరో:** ఖమ్మం నగరం రమణగుట్ట ప్రాంతంలో నివసిస్తున్న కొరివి మేరీ ఇంటి అవసరాల కోసం కొత్త బస్టాండ్ సమీపంలోని డిసిసిబి బ్యాంక్ లో మాటికేజ్ చేసు కొని లోన్ ఇవ్వమని కోరడం జరిగిందని గత నాలుగు నెలలుగా బ్యాంక్ ఉద్యోగులు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారని ఆమె సోమవారం ప్రజావాణి లో దరఖాస్తు చేసుకోవడం జరిగింది. తక్షణమే స్పందించిన జేసీ శ్రీజ వెంటనే డీసీసీబీ సీఈఓ ని పిలిపించి నిర్లక్ష్యం వహించిన అధికారులను అక్కడకు వచ్చేలా చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. సీఈఓ పిలిచిన అధికారులు ఏదో కుంటి సాకు చెప్పి ప్రజావాణి వద్దకు చేరుకోలేదు. మరింతగా ఆగ్రహించిన జేసీ బాధితులకు రెండు రోజుల్లో న్యాయం చేయాలని ఆ రిపోర్ట్ తనకు అందించాలని లేకుంటే తీవ్రమైన చర్యలు ఉంటాయి అని స్పష్టం చేశారు. జెసి చూపిన చొరవకు బాధితులు అయినా మేరీ భర్త కొరివి ఆనంద్ అభినందనలు తెలిపారు. తనకు అంగవైకల్యం ఉందని అధికారులకు పలుమార్లు విన్నవించిన ఫీల్డ్ ఆఫీసర్, బ్యాంక్ మేనేజర్, మరో ఔట్సోర్సింగ్ ఉద్యోగి నిర్లక్ష్యం సహించలేక గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తన ఆర్థిక పరిస్థితులు బాగోలేదన్న వినిపించుకోకుండా పదేపదే తమను బ్యాంకు చుట్టూ తిప్పించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జెసి స్పందించిన తీరు హర్షించదగిన విషయమని మరో వికలాంగుడికి ఈ విధంగా జరగకుండా నిర్లక్ష్యం వహించిన అధికారుల మీద చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# కాంగ్రెస్ తెచ్చిన కరువు!

(మొదటిపేజీ తరువాయి)
ప్రకటించాల్సి వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు.

**మేడిగడ్డ మరమ్మతులు వెంటనే చేపట్టాలి**

కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లను నడిపి నీటిని ఎత్తాలని విశ్రాంత ఇంజినీర్లు సూచించినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. రాజకీయ కారణాలతో మేడిగడ్డకు మరమ్మతులు చేయకుండా ప్రాజెక్టును నిరుపయోగంగా ఉంచారని ఆరోపించారు. జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ నీటిని ఎత్తాలా వద్దా అనేది రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమని చెప్పిందని, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు బాగున్నాయని కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ నివేదిక ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ నివేదికల ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయిని అని, దాని ద్వారా కరువును ఎదుర్కొనే అవకాశం ఉందని అన్నారు.

**మహారాష్ట్రతో చర్చల్లో బీఆర్ఎస్ చొరవ**

తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు ఎత్తును 152 మీటర్లకు అంగీకరించాలని కోరుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పలుమార్లు మహారాష్ట్రతో చర్చలు జరిపిందని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ ఆదేశాల మేరకు 2014 జూలై 23న మహారాష్ట్రకు వెళ్లామని, ఆ తర్వాత 2014 ఆగస్టు 16, డిసెంబర్ 23, 2015 ఫిబ్రవరి 4, ఫిబ్రవరి 17 తేదీల్లోనూ చర్చలు జరిపినట్లు వివరించారు. అప్పటి కాంగ్రెస్ మంత్రి హసన్ ముష్రఫ్‌తో పాటు మహారాష్ట్ర ప్రతినిధులను కలిసి తమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుకు అంగీకరించాలని కోరామని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం చర్చలు ప్రారంభించడానికే 1,054 రోజులు తీసుకుందని విమర్శించారు. గతంలో తాము అధికారంలోకి వచ్చిన తొలి ఆరు నెలల్లోనే పలుమార్లు చర్చలు జరిపామని పేర్కొన్నారు.

**తమ్మిడిహట్టి నీటి లభ్యతపై కేంద్రం లేఖలు**

తమ్మిడిహట్టి వద్ద తెలంగాణకు అవసరమైన స్థాయిలో నీరు అందుబాటులో లేదని కేంద్ర జల సంఘం మూడు లేఖల్లో పేర్కొందని హరీశ్‌రావు తెలిపారు. 2015 ఫిబ్రవరి 18న 160 టీఎంసీల నీరు అందుబాటులో లేదని, మార్చి 4న ఎగువ రాష్ట్రాల వాటాలు, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని ఎంత నీటిని మళ్లించవచ్చో పరిశీలించాలని సూచించినట్లు వివరించారు. 2015 మార్చి 13న అప్పటి కేంద్ర జలవనరుల మంత్రి ఉమాభారతి కూడా ప్రత్యామ్నాయాన్ని పరిశీలించాలని లేఖ రాసినట్లు చెప్పారు. ఈ పరిస్థితుల్లోనే మేడిగడ్డ నుంచి 240 టీఎంసీల నీటిని వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల తాగునీటి అవసరాలకే సుమారు 50 టీఎంసీలు అవసరమవుతాయని, సాగునీటి అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు.

**వార్ధా, చెన్నూరు ప్రాజెక్టులనూ ముందుకు తీసుకెళ్లాలి**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చెన్నూరు ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. వార్ధా నదిపై 20 టీఎంసీల నీటి వినియోగంతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారు చేసి కేంద్రానికి పంపినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నివేదిక వెనక్కి వచ్చిందని, ఆ తర్వాత వాటిని ముందుకు తీసుకెళ్లలేదని విమర్శించారు. తమ్మిడిహట్టి వద్ద కొత్త ప్రాజెక్టు నిర్మాణానికి తమకు అభ్యంతరం లేదని, అయితే నీటి లభ్యత, ఆయకట్టు, వ్యయం వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. రూ.25 వేల కోట్లతో తమ్మిడిహట్టి నుంచి నీటిని తీసుకొచ్చి సుందిళ్లలో పోస్తారంటూ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

**గ్రావిటీ ద్వారా నీళ్లు తెస్తారా? ఉత్తమ్‌కు సవాల్**

తమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీటిని తీసుకొస్తామని చెబుతున్న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన వాదనను సమర్థించే సమగ్ర ప్రాజెక్టు నివేదికను బయటపెట్టాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు. గ్రావిటీ ద్వారా నీటిని తీసుకురావడం సాధ్యమని నిరూపించాలని, లేకపోతే తనతో పాటు రాజీనామాకు సిద్ధమా అని ప్రశ్నించారు. ప్రాజెక్టు అంచనాలు, నీటి లభ్యత, ఆయకట్టు వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. "నీళ్లను కొనలేం.. మరి అందుబాటులో ఉన్న నీటిని ఎందుకు ఎత్తడం లేదు?" అని ప్రశ్నిస్తూ, మేడిగడ్డకు వెంటనే మరమ్మతులు చేసి సాగు, తాగునీటి అవసరాలు తీర్చాలని కోరారు.

## వాల్మీకి ఆశయాలు సమాజానికి స్ఫూర్తిదాయకం

- రామాయణంతో ధర్మ మార్గాన్ని చాటిన మహర్షి
- మానవత్వం, సమానత్వం, సోదరభావం ఆయన బోధనల సారం
- వాల్మీకి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**కాకతీయ, వరంగల్ బ్యూరో :** వాల్మీకి మహర్షి ఆశయాలు, బోధనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రామాయణ మహాకావ్యాన్ని రచించి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలు, ధర్మ మార్గాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు వాల్మీకి అని కొనియాడారు. వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయన బోధనలు సమాజంలో మానవత్వం, సమానత్వం, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు నైతిక విలువల పరిరక్షణకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, భావితరాలకు మంచి విలువలను అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, వాల్మీకి సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## కుస్తీలో సహస్రకు రాష్ట్ర స్థాయిలో స్వర్ణం

- జాతీయ స్థాయి పోటీలకు దుగ్గొండి విద్యార్థిని అర్హత
- ఢిల్లీలో జరిగే పోటీల్లో సత్తా చాటేందుకు సిద్ధం
- సహస్రను సన్మానించిన రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శానబోయిన రాజ్‌కుమార్



**కాకతీయ, దుగ్గొండి :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని వరంగల్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శానబోయిన రాజ్‌కుమార్ అన్నారు. ఇటీవల నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడల్లో దుగ్గొండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన యాదగిరి సహస్ర 33 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి, ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రామస్వామి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సహస్రను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో ప్రతిభ చూపితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో పతకం సాధించి పాఠశాలకు పేరు తీసుకొచ్చిన సహస్రను ప్రధానోపాధ్యాయుడు రామస్వామి అభినందించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ తోకల నర్సింహారెడ్డి, రెజ్లింగ్ జిల్లా బాధ్యులు, యాదగిరి సుధాకర్, సర్పంచ్ కామిశెట్టి ప్రశాంత్, ఉపసర్పంచ్ పల్లె వైష్ణవి శ్యామ్, గుండెకారి రవికుమార్, కూస రమేష్, కోచ్‌లు కందికొండ రాజు, దేవేందర్, ఫిజికల్ డైరెక్టర్ ఐలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి సీఎం సహాయనిధి అండ

- దాసరి స్వామి వైద్యానికి రూ.3 లక్షల సాయం
- నిమ్స్‌లో ఆపరేషన్‌కు రూ.5 లక్షల ఖర్చు



**కాకతీయ, రుద్రంగి :** నిరుపేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలిచింది. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన దాసరి స్వామి గత ఐదు, ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, ఆపరేషన్‌కు సుమారు రూ.5 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఉన్న స్వామి కుటుంబం తమ సమస్యను మానాల మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లింది. ఆయన చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.3 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. ఈ నేపథ్యంలో ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఆపద సమయంలో ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మానాల మోహన్‌రెడ్డికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మానాల ఉపసర్పంచ్ దాసరి అశోక్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ సాయం అందేలా ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ తీసుకోవాలని కోరారు.

## ఓవర్‌లోడ్, లో-వోల్టేజీ సమస్యలకు పరిష్కారం

- శంకరాజుపల్లి, ముల్లెకట్టలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు



**కాకతీయ, ఏటూరునాగారం :** ఏటూరునాగారం మండలంలోని శంకరాజుపల్లి, ముల్లెకట్ట గ్రామాల్లో తరచూ ఎదురవుతున్న విద్యుత్ ఓవర్‌లోడ్, లోవోల్టేజీ సమస్యల పరిష్కారానికి విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రెండు గ్రామాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి ఛార్జింగ్ చేశారు. విద్యుత్ వినియోగం పెరగడంతో సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులను అధిగమించి వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా ఈ ఏర్పాట్లు చేపట్టారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు పనులను వేగంగా పూర్తి చేశారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల అందుబాటుతో ఆయా గ్రామాల్లో ఓవర్‌లోడ్, లోవోల్టేజీ సమస్యలు తగ్గి విద్యుత్ సరఫరా మెరుగుపడనుంది. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ బిక్షపతి, డీఈ పురుషోత్తం, ఏడీఈ ఉమారావు, ఏఈ పండ్ల శేఖర్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.23 లక్షలతో కాలువ అభివృద్ధి

- ఎస్సారెస్పీ మైనర్ కాలువలో పూడికతీత
- 37 కిలోమీటర్ల మేర చెట్ల తొలగింపు పనులు
- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్

**కాకతీయ, నెల్లికుదురు:** రైతులకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ తెలిపారు. సోమవారం నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామం వద్ద ఎస్సారెస్పీ డీబీఎం48 మైనర్ కాలువ అభివృద్ధి పనులను రూ.23 లక్షలతో ఆయన ప్రారంభించారు. సుమారు 37 కిలోమీటర్ల పొడవున కాలువలో పెరిగిన చెట్ల తొలగింపు, పూడికతీత పనులు చేపట్టనున్నారు. ఈ పనులతో నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగి, సాగునీరు సక్రమంగా ప్రవహిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డీఈ రాందాస్, ఏఈ సుష్మ, ఆలేరు సర్పంచ్ నాయిని పద్మ సత్యపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎదల్ల యాదవ రెడ్డి, ఇనుగుర్తి మండల పార్టీ అధ్యక్షుడు బైరు అశోక్‌గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఓట్ల చోరీని అడ్డుకుంటాం!

- ఓటర్ల జాబితాలో అక్రమాలపై కాంగ్రెస్ సమరం
- ప్రతి బూత్‌లో తొలగించిన ఓట్లపై క్షేత్రస్థాయి పరిశీలన
- 'ఓట్ బచావో–దేశ్ బచావో' మూడో దశ కార్యాచరణ ఖరారు
- రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాటం
- ఏఐసీసీ పరిశీలకుడు కేబీఆర్ నాయుడు, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల











**కాకతీయ, హన్మకొండ :** కేంద్ర ప్రభుత్వ స్వార్థ ప్రయోజనాల కోసం ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడుతున్నారని, ఎన్నికల సంఘాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఏఐసీసీ పరిశీలకుడు కేబీఆర్ నాయుడు, హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి విమర్శించారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఓట్ బచావో-దేశ్ బచావో' ఉద్యమాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. అక్టోబర్ 26న హనుమకొండ జిల్లా డీసీసీ భవన్‌లో ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఉద్యమ మూడో దశ కార్యాచరణ సమావేశంలో వారు మాట్లాడారు. మొదటి, రెండో దశలను పూర్తి చేసుకున్న ఉద్యమాన్ని ఇప్పుడు ప్రతి బ్లాక్, బూత్, గ్రామస్థాయికి విస్తరించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు.

**ప్రతి బూత్‌లో ఓట్ల పరిశీలన**

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, బూత్ స్థాయి ఏజెంట్లతో సమావేశాలు నిర్వహిస్తామని నేతలు తెలిపారు. ఏఐసీసీ డిజిటల్ వేదిక 'ఓట్ రక్షక్' వినియోగంపై బూత్ ఏజెంట్లు, స్వచ్ఛంద కార్యకర్తలకు శిక్షణ ఇస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాలను పరిశీలించి, అక్రమంగా తొలగించిన లేదా మార్చిన ఓట్ల వివరాలను సేకరిస్తామని చెప్పారు. సంతకాలతో కూడిన నివేదికలను సిద్ధం చేసి సంబంధిత అంశాలను వెలుగులోకి తీసుకొస్తామన్నారు. ప్రతి గ్రామంలో ఓటర్లు, గ్రామ పెద్దలు, యువకులు, పంచాయతీ ప్రతినిధులతో సంప్రదాయ మంచాల సమావేశాల తరహాలో 'గ్రామ చౌపాల్' కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఓటు హక్కు ప్రాముఖ్యత, ఓటర్ల జాబితాలో అక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని, కార్యక్రమాల ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తామని వివరించారు. ఎన్నికల ప్రక్రియలో మార్పులు తీసుకురావాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. దేశ ప్రజల భవిష్యత్తు కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారని, రాబోయే రోజుల్లో ఆయనే ప్రధానమంత్రి అవుతారని కేబీఆర్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు. నవంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే జాతీయ ర్యాలీతో పాటు నవంబర్ 25, 26 తేదీల్లో నిర్వహించనున్న 'దిల్లీ చలో' కార్యక్రమానికి జిల్లా నుంచి మద్దతు తెలుపుతామని చెప్పారు. ఈ సమావేశంలో టీపీసీసీ సమన్వయకర్త అరికెల నర్సారెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కె.ఆర్. నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి, టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ గుండు సుధారాణి, మేర కోఆపరేటివ్ చైర్మన్ సంగ వెంకట్రాజం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య, అధికార ప్రతినిధి కూచన రవళి, టీపీసీసీ సభ్యుడు భట్టి శ్రీనివాస్‌రావు, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు ఎండీ అయ్యూబ్, వరంగల్ గ్రెయిన్ మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక, సాగరిక రావు, మాజీ కార్పొరేటర్లు, మండల, డివిజన్ అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామాయణ విలువలు నేటికీ ఆదర్శప్రాయం

- మార్గదర్శకంగా వాల్మీకి బోధనలు
- పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ రవీందర్ పులిగిల్ల



**కాకతీయ, వరంగల్:** మహర్షి వాల్మీకి బోధనలు సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని వరంగల్ పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ రవీందర్ పులిగిల్ల, ఐపీఎస్ అన్నారు. మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని, వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహర్షి వాల్మీకి రచించిన రామాయణం మానవాళికి నీతి, ధర్మం, సత్యనిష్ఠ, ఆదర్శ జీవన విలువలను అందించిందని పేర్కొన్నారు. ఆయన బోధనలు తరతరాలకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కే. రవీందర్, విజయ్ కుమార్, ఆర్ఐ కే. నగేష్, టి. చంద్రశేఖర్‌తో పాటు పోలీస్ ట్రైనింగ్ కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్లు.. రైతులకు రహదారులు

- రెండో విడతలో మరో 1,100 ఇందిరమ్మ ఇళ్లు
- పొలాల రహదారులకు రూ.100 కోట్లు నిధులు
- తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం
- యాసంగిలో తక్కువ నీటితో పండే పంటలే సాగు చేయాలి : మంత్రి తుమ్మల





**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** పేదలకు సొంతింటి కల నెరవేర్చడంతోపాటు రైతుల పొలాలకు రహదారులు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో మొదటి విడతలో 1,300కు పైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, రెండో విడతలో మరో 1,100 ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రైతుల పొలాలకు రహదారుల నిర్మాణానికి ఇప్పటికే రూ.75 కోట్లు మంజూరు చేశామని, త్వరలో మరో రూ.25 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. సోమవారం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి మండలంలో పర్యటించిన మంత్రి మల్లేపల్లిలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. అనంతరం నల్లకుంట చెరువును సందర్శించారు. గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన పేదలకు రాజకీయాలు, పార్టీలతో సంబంధం లేకుండా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని, ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతిల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**రైతుల పొలాలకు రహదారులు**

రైతులు తమ పొలాలకు సులభంగా చేరుకునేలా రహదారుల నిర్మాణానికి మొత్తం రూ.100 కోట్లు అందుబాటులోకి రానున్నాయని తుమ్మల తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, ప్రజలకు ఉపయోగపడే పనులను వీబీ-జీ రామ్‌జీ పథకం ద్వారా చేపట్టాలని అధికారులకు సూచించారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో యాసంగిలో వరికి బదులుగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని మంత్రి రైతులకు సూచించారు. తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యమిస్తూ నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని కోరారు. రఘునాథపాలెం మండలంలో వెంకటాయపాలెం డీప్‌కట్ నుంచి మంచుకొండ లిఫ్ట్ ద్వారా 25 చెరువులకు, బుగ్గవాగు నుంచి మరో 11 చెరువులకు నీరందించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పుట్టకోట నీటి వనరులను నింపాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ప్రజాప్రతినిధులు రాయల నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య, ఇరిగేషన్ డీఈ మోతీలాల్, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## బౌద్ధ స్తూపానికి పూర్వ వైభవం!

- అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా నేలకొండపల్లి
- 10 రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లుల చెల్లింపు
- పాలేరు పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని మూడో శతాబ్దానికి చెందిన చారిత్రక బౌద్ధ స్తూపాన్ని అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం బౌద్ధ స్తూపం పరిసరాల్లో పర్యాటక సదుపాయాల కల్పన, చారిత్రక కట్టడాల సంరక్షణ, పునరుద్ధరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. సుమారు 50-55 ఏళ్ల క్రితం గుర్తించిన ఈ స్తూపం దేశంలోని అతిపెద్ద బౌద్ధ స్తూపాల్లో ఒకటని పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లో పురావస్తు తవ్వకాల్లో లభించిన ప్రాచీన వస్తువులను భద్రపరిచేందుకు స్థానికంగా వసతులు లేక హైదరాబాద్ మ్యూజియంలో ఉంచారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు బౌద్ధ కట్టడాలపై అవగాహన ఉన్న నిపుణులు, అధికారులతో సమావేశం నిర్వహించి అభివృద్ధి ప్రణాళిక రూపొందిస్తామన్నారు.

**10 రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు**

రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న తుది బిల్లులను మరో పది రోజుల్లోగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఎలాంటి లంచాలకు తావులేకుండా చెల్లింపులు జరిపే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. నేలకొండపల్లి రైతు వేదికలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో మొదటి విడతలో మంజూరైన 648 ఇళ్లలో సుమారు 620 పూర్తయ్యాయని, మిగిలిన వాటిని కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, విద్యుత్, నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో రెండో పంట వేయవద్దని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు అనాసాగరం నుంచి పమ్మి వరకు 2.5 కిలోమీటర్ల మేర రూ.2.80 కోట్ల అంచనా వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పాలేరు నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్షించారు. కుసుమంచి మండలం గోరిల్లపాడు తండాలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఏదులాపురం మున్సిపాలిటీలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో కలెక్టర్ దివాకర టీఎస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

- పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు తీసుకోవాలి
- ప్రజావాణిలో 28 దరఖాస్తుల స్వీకరణ
- అధికారులకు కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆదేశం



**కాకతీయ, ములుగు :** ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, అవసరమైన చోట క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని స్పష్టం చేశారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పరిష్కారానికి తీసుకున్న చర్యలను సంబంధిత దరఖాస్తుదారులకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 28 దరఖాస్తులు అందాయి. వీటిలో భూ సమస్యలకు సంబంధించి 9, ఇందిరమ్మ ఇళ్ల కోసం 2, పింఛన్లకు సంబంధించి 3, ఇతర సమస్యలపై 14 దరఖాస్తులు ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా రెవెన్యూ అధికారి రవికుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రెండో విడత దళితబంధు వెంటనే అమలు చేయాలి

- ఎంపికైన లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించాలి
- హుజురాబాద్, మధిర తరహాలో సిరిసిల్లలోనూ అమలు చేయాలి
- కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చిన దళితబంధు సాధన కమిటీ నేతలు



**కాకతీయ, సిరిసిల్ల :** రెండో విడత దళితబంధు పథకానికి ఎంపికైన లబ్ధిదారులందరికీ వెంటనే ఆర్థిక సాయం అందించాలని దళితబంధు సాధన కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. హుజురాబాద్, మధిర ప్రాంతాల్లో రెండో విడత పథకం అమలు చేసిన నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోనూ ఎంపికైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. రెండో విడతలో ఎంపికైనప్పటికీ ఇప్పటివరకు ఆర్థిక సాయం అందని వారికి నిధులు మంజూరు చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులందరికీ పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నీరటి కిరణ్‌కుమార్, వేములవాడ నియోజకవర్గ కన్వీనర్ దమ్మ భాస్కర్, జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్, వేములవాడ నియోజకవర్గ మాల మహానాడు కన్వీనర్ బత్తుల కమలాకర్, చంటి బాబురావు, బండి శ్రావణ్, పెంట బాబు, గుడిసె రమేష్, కట్కూరి స్వామి, ఎల్. హరీష్, బత్తుల రవి, బింగి స్వామి, మల్యాల మహేష్, జి. దేవయ్య, న్యాత సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం వీడండి

- బల్దియా కమిషనర్ వెంకన్న

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వాన్ని వీడాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావానికి అనుగుణంగా సంబంధిత విభాగాలకు బదలాయించారు. గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యాన్ని సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గత వారం ప్రజావాణిలో స్వీకరించిన వినతుల పరిష్కార స్థితిగతులను కమిషనర్ విభాగాల వారీగా సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న అంశాలను తక్షణమే పరిష్కరించడంతో పాటు, తీసుకున్న చర్యలను సంబంధిత ఫిర్యాదుదారులకు తెలియజేయాలని సూచించారు. ప్రజలకు అందించే ప్రతి పౌర సేవలో పారదర్శకత, జవాబుదారీతనం, వేగం ఉండాలని కమిషనర్ పేర్కొన్నారు. వివరాలు ఇలా.. టౌన్ ప్లానింగ్ విభాగానికి 39, ఇంజినీరింగ్ కు 48, ఆరోగ్యం, పారిశుద్ధ్యంకు 15,రెవెన్యూకు 10, హార్టికల్చర్ 01 మొత్తం 113 దరఖాస్తులు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ రాజ్ కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్ బాబు, హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, పన్నుల అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# వైద్య విద్యలో ప్రీతి ప్రతిభ

- ఎండీ కమ్యూనిటీ మెడిసిన్‌లో నాలుగో ర్యాంకు
- నాగ్‌పూర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో చదువు
- చేర్యాల వైద్య విద్యార్థిని డాక్టర్ పోగుల ప్రీతికి అరుదైన ఘనత



**కాకతీయ, చేర్యాల :** వైద్య విద్యలో చేర్యాల పట్టణానికి చెందిన డాక్టర్ పోగుల ప్రీతి ప్రతిభ చాటుకున్నారు. ఎండీ కమ్యూనిటీ మెడిసిన్ పరీక్షల్లో విశ్వవిద్యాలయ స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించారు. నాగ్‌పూర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసించిన ఆమె, మహారాష్ట్ర ఆరోగ్య శాస్త్రాల విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఫలితాల్లో ఈ ఘనత సాధించారు. చేర్యాలకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కర్రోల్ల ఎలీషా మనుమరాలు ప్రీతి ఈ విజయం సాధించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తన విజయానికి సహకరించిన విభాగాధిపతి, అధ్యాపకులు, సీనియర్లు, జూనియర్లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం తన విజయానికి తోడ్పడిందన్నారు. ప్రజారోగ్యంపై ఆసక్తితో కమ్యూనిటీ మెడిసిన్‌ను ఎంచుకున్నానని ప్రీతి తెలిపారు. వ్యాధుల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఆమె సాధించిన విజయంపై పలువురు అభినందనలు తెలిపారు.

# పట్టభద్రుల నమోదు వేగవంతం చేయాలి!

- అర్హులైన ప్రతి పట్టభద్రుడి నమోదు పూర్తిచేయాలి
- బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ
- మడికొండలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రం పరిశీలన



**కాకతీయ, కాజీపేట :** నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడినీ ఓటరుగా నమోదు చేయించాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ రాష్ట్ర కో‌ఇన్‌చార్జి డాక్టర్ వన్నాల వెంకటరమణ సూచించారు. మడికొండలో జిల్లా కార్యదర్శి పోనగోటి వెంకట్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన సందర్శించి, నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటివరకు నమోదైన వివరాలు, నమోదు పురోగతి, క్షేత్రస్థాయిలో కార్యకర్తలు చేపడుతున్న కార్యక్రమాలపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటరు నమోదు కీలకమని, అర్హులైన ఒక్క పట్టభద్రుడి వివరాలు కూడా నమోదు కాకుండా మిగిలిపోకూడదని వన్నాల వెంకటరమణ అన్నారు. పట్టభద్రులను నేరుగా సంప్రదించి, అవసరమైన వివరాలు సేకరించి, నిర్ణీత గడువులోగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ జిల్లా కోకన్వీనర్ త్రిలోకేశ్వర్‌రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు గడ్డం మహేందర్, మడికొండ కన్వీనర్ మిట్టపల్లి హేమంత్, చెన్నబోయిన శివకుమార్, నాయిని కుమార్, మారం రాము యాదవ్, దార ధనుంజయ్, తాడేం రంజిత్, గుండాల కళ్యాణ్, అన్నందాస్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదుపై దృష్టి

- అర్హులైన వారందరూ ఓటర్లుగా నమోదు కావాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పిలుపు
- న్యాయవాదులు, పట్టభద్రులకు ఫారం-18 అందజేత



**కాకతీయ, హనుమకొండ :** వరంగల్-నల్గొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని మాజీ ఎంపీ, తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి బోయినపల్లి వినోద్‌కుమార్, ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ కోరారు. సోమవారం హనుమకొండ జిల్లా కోర్టు సముదాయంలో న్యాయవాదులను, వడ్డేపల్లి 60వ డివిజన్ టీచర్స్ కాలనీలో పట్టభద్రులను కలిసి ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించారు. అర్హులైన వారికి ఫారం18 అందజేసి, ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని, నమోదు ప్రక్రియలో పార్టీ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ వాసుదేవ రెడ్డి, ఏనుగుల రాకేష్‌రెడ్డి, సహోదర్ రెడ్డి, జనార్ధన్ గౌడ్, రఘు, తోట నవీన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# అడవి పంది మాంసం విక్రయించిన వ్యక్తిపై కేసు నమోదు

- వన్యప్రాణులకు హాని కలిగిస్తే చర్యలు తప్పవు
- తొర్రూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మి



**కాకతీయ, ఇనుగుర్తి :** వన్య ప్రాణులకు హాని కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని తొర్రూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ అడవి పంది మోసం విక్రయించినకోమటిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మూల స్తంభం ప్రాంతానికి చెందిన నూనావత్ వెంకన్న పై విచారణ జరిపి, వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1972 వైల్డ్ లైఫ్ ప్రొడక్షన్ యాక్ట్ నిబంధనల ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందని,వన్యప్రాణుల సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వన్యప్రాణులకు హాని కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. వన్యప్రాణులను వేటాడటం, అక్రమంగా రవాణా చేయడం, చంపడం, విద్యుత్ తీగలు అమర్చడం, ఉచ్చులు వేయడం వంటి చర్యలు చట్టరీత్యా నేరాలు. అదేవిధంగా, వన్యప్రాణుల మాంసాన్ని అక్రమంగా విక్రయించడం లేదా చట్టవిరుద్ధంగా కలిగి ఉండటం కూడా నేరమే. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎఫ్ ఆర్ వో తెలిపారు.

# మానాల పాఠశాల విద్యార్థులకు ఉచితంగా షూల పంపిణీ

**కాకతీయ, రుద్రంగి:** రుద్రంగి మండలం మనాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం ప్రభుత్వం అందించిన ఉచిత షూలను ప్రధానోపాధ్యాయుడు తిరుపతి విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులను ప్రోత్సహించి, వారి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ఈ సదుపాయం కల్పించిందన్నారు. ఉచితంగా షూలు అందడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మానస, వాణి, ప్రియాంక, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.



# గిరిజన దర్బార్‌లో వినతుల వెల్లువ

- విద్య, రహదారులు, భూ సమస్యలపై అర్జీలు
- వినతులను సత్వరమే పరిష్కరించాలి
- ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో



**కాకతీయ, ఏటూరునాగారం :** ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌కు ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. విద్యుత్, భూ సమస్యలు, పాఠశాలల్లో మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీల నిర్మాణం, ఉద్యోగ నియామకాలు తదితర అంశాలపై ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. వినతులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సంబంధిత అధికారులను ఆదేశించారు. పంట పొలాలకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని, కొండాయిలో గోవిందరాజుల జాతరకు అవసరమైన ఏర్పాట్లకు సహాయం అందించాలని ప్రజలు కోరారు. అంకంపల్లి పాఠశాలలో వంటశాల నిర్మాణం, ఇప్పలగడ్డ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని వినతులు అందాయి. రాఘవపట్నం నుంచి రంగాపురం వరకు మట్టి రహదారి నిర్మాణంతోపాటు పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని దరఖాస్తులు సమర్పించారు. ఉద్యోగ నియామకాలు, డిప్యూటేషన్లు, 2012 డీఎస్సీ మెరిట్ జాబితా, డీఎల్ఎస్సీ వివరాలు, పెండింగ్ వేతనాల చెల్లింపు, ఆర్ఓఎఫ్ఆర్ పట్టా పాస్‌బుక్‌ల జారీకి సంబంధించి వినతులు అందాయి. ఇందిరా జలప్రభ పథకం కింద మూడు బోర్‌వెల్లు మంజూరు చేయాలని, గూడూరు మండలంలోని ఏకలవ్య పాఠశాల భూ సమస్యను పరిష్కరించాలని కోరారు. భూ ఆక్రమణకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ అంశంపై కన్నాయిగూడెం పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన ఫిర్యాదును కూడా సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పీఓ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ప్రతాప్, ఏఓ అనిల్, డీడీ జనార్దన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులకు క్రీడా పోటీలు

- గిరిజన విద్యార్థులకు క్రీడా పోటీలు
- నవంబర్ 5 నుంచి మూడు డివిజన్లలో నిర్వహణ
- 14, 17 ఏళ్ల విభాగాల్లో బాలబాలికలకు పోటీలు



**కాకతీయ, ములుగు :** ములుగు జిల్లాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న బాలబాలికలకు నవంబర్ 5 నుంచి డివిజన్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. 14, 17 ఏళ్ల వయో విభాగాల్లో పోటీలు నిర్వహించేందుకు ఏటూరునాగారం ఐటీడీఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం డిప్యూటీ డైరెక్టర్ దబ్బగట్ల జనార్దన్ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాలు, ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టొప్పో అనుమతి మేరకు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. మూడో డివిజన్ పరిధిలోని వాజేడు, వెంకటాపురం ప్రాంతాల విద్యార్థులకు నవంబర్ 5, 6 తేదీల్లో లక్ష్మీనగర్ బాలుర ఆశ్రమ పాఠశాలలో పోటీలు జరుగుతాయి. మొదటి డివిజన్‌లోని ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి మండలాలకు నవంబర్ 10, 11 తేదీల్లో మేడారం బాలికల ఆశ్రమ పాఠశాలలో, రెండో డివిజన్‌లోని ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం మండలాలకు నవంబర్ 12, 13 తేదీల్లో చిన్నబోయినపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో పోటీలు నిర్వహిస్తారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, క్యారం, టెన్నికాయిట్, ఆర్చరీ, అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. డివిజన్ల కన్వీనర్లుగా పీఈటీలు చింత సతీష్, చింత రమేష్, పీడీ మల్లె నాగేందర్ వ్యవహరిస్తారు. సమావేశంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఈరులాల్, ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్ ఆలం శ్యామలత, ములుగు స్పోర్ట్స్ ఆఫీసర్ యాలం ఆదినారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు ఎంజా సత్యనారాయణ, తోలెం సమ్మయ్య, మేకల కృష్ణ, బిజ్జా సునీత, చింత రమేష్, వంక రాంచందర్ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సంక్షేమ సంఘానికి నూతన కార్యవర్గం

- ఉపాధ్యాయ సంక్షేమ సంఘానికి నూతన కార్యవర్గం
- అధ్యక్షుడిగా దామెరకొండ సదానందం ఏకగ్రీవ ఎన్నిక
- ప్రధాన కార్యదర్శిగా జడల శ్రీనివాసరావు, కోశాధికారిగా కడారి మహేష్
- 23 ఏళ్ల సంఘ ప్రస్థానం.. 17 మంది విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం



**కాకతీయ, వరంగల్ :** రంగశాయిపేట ఉపాధ్యాయ సంక్షేమ పరపతి సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం స్థాపించి 23 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మూడోసారి అధ్యక్షుడిగా దామెరకొండ సదానందం, ప్రధాన కార్యదర్శిగా జడల శ్రీనివాసరావు, కోశాధికారిగా కడారి మహేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ సభ్యులకు ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు ప్రతిభావంతులను ప్రోత్సహించే కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. 189 మంది సభ్యుల సహకారంతో సంఘం మరింత అభివృద్ధి చెందుతుందని శ్రీనివాసరావు ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో ఉద్యోగ విరమణ పొందిన 17 మంది సభ్యులతోపాటు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొందిన ఎనిమిది మందిని సన్మానించారు. రాబోయే రెండేళ్లకు సంబంధించిన తీర్మానాలను చర్చించి ఆమోదించారు. ఉపాధ్యక్షులుగా కుమ్మరి బాబురావు, గుండు కామేశ్వర్‌రావు, సహాయ కార్యదర్శులుగా డాక్టర్ బొమ్మెర కుమారస్వామి, శేర్ల భాస్కర్, వల్లాజి నర్సింహస్వామి ఎన్నికయ్యారు. మహిళా కార్యదర్శిగా కొత్తగట్టు కళ, ఇతర కార్యవర్గ సభ్యులు, శాశ్వత సభ్యులు, గౌరవ సలహాదారులు, ఆడిట్ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. సంఘం క్రమశిక్షణతో, పారదర్శకంగా కొనసాగుతోందని సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# స్వామి శాగంటికి ఇండియా స్కూల్ లీడర్‌షిప్ అవార్డు

- మేచరాజుపల్లి ఉపాధ్యాయుడికి జాతీయ స్థాయిలో గౌరవం!
- న్యూఢిల్లీలో 15 రాష్ట్రాల విద్యావేత్తల సమక్షంలో పురస్కారం




**కాకతీయ, నెల్లికుదురు:** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న స్వామి శాగంటికి ప్రతిష్ఠాత్మక ఇండియా స్కూల్ లీడర్‌షిప్ అవార్డు-2026 లభించింది. అక్టోబర్ 25న న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో నిర్వహించిన ఇండియా స్కూల్ లీడర్‌షిప్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. వరల్డ్ అలయన్స్ ఆఫ్ స్కూల్ ప్రిన్సిపల్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో 15 రాష్ట్రాలకు చెందిన విద్యావేత్తలు, ప్రధానోపాధ్యాయులు, విద్యారంగ ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన బోధన, వారిలో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు చేస్తున్న కృషికి గుర్తింపుగా స్వామి శాగంటికి ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినూత్న బోధనా పద్ధతులతో విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయడంతో పాటు, ఉన్నత విద్య, భవిష్యత్తు అవకాశాల వైపు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ గుర్తింపునకు సహకరించిన సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి శాగంటికి జాతీయ స్థాయి పురస్కారం లభించడంపై మేచరాజుపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, కుటుంబ సభ్యులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

# బాణాసంచా విక్రయాలకు నవంబర్ 2లోపు దరఖాస్తు

- తాత్కాలిక దుకాణాలకు తప్పనిసరిగా అనుమతులు
- అవసరమైన ధ్రువపత్రాలు, బ్యాంకు చలాన్ సమర్పించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సూచన



**కాకతీయ, వరంగల్ బ్యూరో :** దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలిక బాణాసంచా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలనుకునే వ్యాపారులు నవంబర్ 2వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు. అవసరమైన ధ్రువపత్రాలతో కూడిన దరఖాస్తులను సంబంధిత డీసీపీ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు అగ్నిమాపక శాఖ నిరభ్యంతర పత్రం, స్థల యజమాని లేదా సంబంధిత ప్రభుత్వ అధికారి అనుమతి పత్రం, వస్తు సేవల పన్ను నమోదు ధ్రువపత్రం జతచేయాలని పేర్కొన్నారు. గతంలో లైసెన్స్ పొందినవారు దాని ప్రతిని, అవసరమైన చోట్ల పక్క స్థలాల యజమానుల అనుమతి పత్రాలు, స్థలానికి సంబంధించిన పటాన్ని సమర్పించాలన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధాలత్ శాఖలో ప్రభుత్వ ఖజానాకు రూ.800 చెల్లించిన బ్యాంకు చలాన్‌ను కూడా జతచేయాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం సంబంధిత డీసీపీ స్థాయి అధికారులు అనుమతులు జారీ చేస్తారని తెలిపారు. అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయాలు చేపడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎన్. శ్వేత హెచ్చరించారు. వ్యాపారులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# సిటీ ప్లానర్ రవీందర్ రెడెకర్‌కు అభినందనలు

**కాకతీయ, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ సిటీ ప్లానర్‌గా పదోన్నతి పొంది బాధ్యతలు చేపట్టిన రవీందర్ రెడెకర్‌ను జీడబ్ల్యూఎంసీ, కుడా లైసెన్స్‌డ్ సర్వేయర్లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడా లైసెన్స్‌డ్ సర్వేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాము సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సుల్తాన్, జీడబ్ల్యూఎంసీ లైసెన్స్‌డ్ సర్వేయర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోరంటాల జగదీశ్వర్, హరీష్ దేవా, అమృత సతీష్, వెంకటేశ్వర్లు, వర్మ, ప్రశాంత్, పోశాల రాజ్‌కుమార్, రాజేష్, ఇతర సర్వేయర్లు పాల్గొన్నారు.



# అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

- కానిస్టేబుల్ గుజ్జెటి మహేశ్‌కు ఎమ్మెల్యే, సీపీ నివాళి
- అమరుడి కుటుంబానికి సన్మానం.. విద్యార్థులకు ఓపెన్ హౌస్
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సీపీ గౌష్ ఆలం



**కాకతీయ, కరీంనగర్ :** దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం గంగాధర పోలీస్ స్టేషన్ ఆవరణలో అమరవీరుడు, కానిస్టేబుల్ గుజ్జెటి మహేశ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 2008లో బలిమెల ఘటనలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన మహేశ్ సేవలను స్మరించుకున్నారు. అనంతరం మహేశ్ కుటుంబ సభ్యులను శాలువాతో సన్మానించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీపీ గౌష్ ఆలం తెలిపారు. పోలీసు ఉద్యోగం క్రమశిక్షణ, త్యాగనిరతితో కూడుకున్నదని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన ఓపెన్ హౌస్‌లో విద్యార్థులకు ఆయుధాలు, పోలీసు విధులు, శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, ఎస్‌ఐలు వంశీకృష్ణ, రాజ్‌కుమార్, రాజుతో పాటు పోలీసు సిబ్బంది, అమరుడి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంచాయతీ నిధులపై విచారణ జరపాలి

- కరీంపేటలో నిధుల వినియోగంపై ఫిర్యాదు
- పనులు, బిల్లులపై క్షేత్రస్థాయి తనిఖీలు చేయాలి
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మాజీ ఎంపీటీసీ గాండ్ల తిరుపతి



**కాకతీయ, శంకరపట్నం:** కరీంపేట గ్రామపంచాయతీలో నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ గాండ్ల తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. శంకరపట్నం మండలం కరీంపేట గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు బిల్లులు సమర్పిస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. సంబంధిత అధికారుల సహకారంతో బిల్లులు మంజూరు చేయించుకుంటున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ భర్త పాలకవర్గ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ ప్రొటోకాల్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. పంచాయతీకి వచ్చిన నిధులు, చేపట్టిన పనులు, మంజూరైన బిల్లులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని కలెక్టర్‌ను కోరారు.

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం!

- నిరంతరాయంగా వెలుగుతున్న వీధి దీపాలు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదంటున్న దేశాయిపల్లి గ్రామస్తులు



**కాకతీయ, దుగ్గొండి :** దుగ్గొండి మండలం దేశాయిపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు నిరంతరాయంగా వెలుగుతూ విద్యుత్ వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండి పడుతున్నారు. విద్యుత్ సమస్యలపై పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని, సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. మరోవైపు గ్రామంలో పలుచోట్ల కేబుల్ వైర్లు కాలిపోవడంతో ప్రమాదాల భయం నెలకొందని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. అవసరమైన పరికరాలు అందుబాటులో లేవంటూ అధికారులు సమస్యలను పరిష్కరించడం లేదని విమర్శిస్తున్నారు. విద్యుత్ వృథాను అరికట్టడంతో పాటు కాలిపోయిన కేబుల్ వైర్లను తక్షణమే మార్చాలని కోరుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని దేశాయిపల్లి గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అక్రమంగా మొరం రవాణా.. టిప్పర్ పట్టివేత

- అనుమతులు లేకుండా తరలిస్తుండగా గుర్తింపు
- అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవు : ఎస్ఐ శేఖర్‌రెడ్డి

**కాకతీయ, శంకరపట్నం :** అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను కేశవపట్నం పోలీసులు పట్టుకున్నారు. మొలంగూరు క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్ (టీఎస్ 08 వీడీ 9010)ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. టిప్పర్ డ్రైవర్ కనుకుంట్ల మల్లేశం, మానకొండూరు మండలం ఊటూరు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కేశవపట్నం ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా మొరం, ఇతర ఖనిజాలను అక్రమంగా తరలిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పోలీసుల నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.



Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266

టీజీఎండీసీకి సుప్రీం కోర్టులో షాక్

డీసిల్టింగ్ వ్యవహారంలో సివిల్ అప్పీల్ డిస్మిస్

నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలపై గతంలో ఎన్జీటీ ఆగ్రహం

సీతమ్మసాగర్ ప్రాజెక్టు పరిధిలో డీసిల్టింగ్‌కు అనుమతులకు నిరాకరణ

తవ్వకాలు నిలిపివేయాలని ట్రిబ్యునల్ ఆదేశాలు

ఎన్జీటీ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకు వెళ్లిన టీజీఎండీసీ

తాజాగా సుప్రీం తీర్పుతో ఇసుక తవ్వకాలపై ప్రతిష్టంభన

అనుమతులు రద్దు చేయాలని కలెక్టర్‌కు స్థానికుల ఫిర్యాదులు

మే 20న గనుల శాఖకు చర్యల కోసం కలెక్టర్ కార్యాలయం లేఖ

సుమారు 12 కోట్ల క్యూబిక్ మీటర్లు డీసిల్టేషన్ ప్రతిపాదనలపై ఎఫెక్ట్

మూడు ప్రొసీడింగ్స్‌పై స్టే విధించిన జాతీయ హరిత ట్రిబ్యునల్

తవ్వకాల నిలిపివేతకు ఆగస్టు 11న ట్రిబ్యునల్ నుంచి ఆదేశాలు జారీ

ఆగస్టు 21న మూడు అనుమతులపైనా స్టేతో స్పష్టీకరణ

తాజా పరిణామాలతో కాంట్రాక్టర్లు, అధికారుల్లో ఉత్కంఠ


Supreme Court of India
COURT - 1
[Coram : HON'BLE THE CHIEF JUSTICE,HON'BLE MR. JUSTICE JOYMALYA BAGCHI,HON'BLE MRS. JUSTICE
Court 1: SEQUENCE WOULD BE ITEM NOS 1 TO 10 11 WITH 43 12 TO 31 PASS OVER THEN REST OF THE 827
Back

| | | | | |
|---|---|---|---|---|
| 24 | C.A. No. 13696/2026 Diary No. 61460 / 2026 | TELANGANA STATE MINERAL DEVELOPMENT CORPORATION LTD. Vs PUNEM RAMULU | P: SRAVAN KUMAR KARANAM- 3132, | OVER (Dismissed) |


GOVERNMENT OF TELANGANA
OFFICE OF THE COLLECTOR & DISTRICT MAGISTRATE, MULUGU

Rc.No.C2/276/2026 Dated:20.05.2026

From
Sri Hemant Bhorkhade, I.A.S.,
District Collector,
Mulugu.

To
Asst. Director, Mines & Geology,
Mulugu.

Sir,

Sub:- Sand - Mulugu District - Requested to cancel sand de-siltation permission issued for sand extraction from Akkinepalli Mallaram, Ramanakkapeta and Wadagudem Villages of Mangapet Mandal under Sitamma Sagar Multi Purpose Project- Take necessary action - Req.- Reg.

Ref:
1. The President, Adivasi Nava Nirmana Sena ANS- Telangana State, Dated: 28.04.2026.
2. A/o Sri Payam Srinivas Rao & 4 others, R/o Wadagudem (V), Mangapet (M), Dated: 02.05.2026.
3. A/o The President, Manayseema Paririrakshana Smaithi Douldebba, Telangana State, Dated: 02.05.2026, 05.05.2026 & 18.05.2026.
4. A/o Sri Mancharla Murali & 7 others, R/o Ramanakkapeta (V), Mangapet (M), Dated: 02.05.2026.
5. A/o Sri Komaram Ramurthy, R/o Ramanakkapeta (V), Mangapet (M), Dated: 08.05.2026 & 18.05.2026.
6. A/o Sri Kandimalla Buchi Lingayya, R/o Dugineppally (V), Pinapaka (M), Badradri Kotahgudem (D),Dated: 08.05.2026.

***********

Attention is invited to the references cited above, wherein certain applications have received regarding cancellation of de-siltation permission issued for sand extraction from Akkinepalli Mallaram, Ramanakkapeta and Wadagudem Villages of Mangapet Mandal under Sitamma Sagar Multi-Purpose Project and also to cancel the conduct of PESA Gramasabhas as de-siltation operations in the said villages may cause ground water declination and may lead to environmental damage.

Hence, while enclosing herewith a copy of reference cited, it is requested to take necessary action in the said matter as per Sand Mining Rules-2015 and submit the compliance withour fail.

Encls: (As above)

Yours faithfully
Sd/- Ch.Mahenderji
For Collector, Mulugu

Copy to
1. Sri Korsa Narsimhamurthy, President, Adivasi Nava Nirmana Sena ANS- Telangana State, R/o Chiruthapally (V), Venkatapuram (M)
2. Sri Payam Srinivas Rao & 4 others, R/o Wadagudem (V), Mangapet (M)

# ఇసుక తవ్వకాలపై సుప్రీం బ్రేక్!

**సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు పరిధిలో చేపట్టిన ఇసుక డీసిల్టింగ్ వ్యవహారం న్యాయపరంగా కీలక మలుపు తిరిగింది. సుమారు 12 కోట్ల క్యూబిక్ మీటర్లు డీసిల్టేషన్ అనుమతులపై ట్రిబ్యునల్ స్టే విధింపు, వాటిని సవాల్ చేస్తూ జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కేసు దాఖలు కావడం, తవ్వకాలు నిలిపివేయాలని ట్రిబ్యునల్ ఆదేశాలు ఇవ్వడం, తాజాగా సుప్రీంకోర్టులో తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ దాఖలు చేసిన సివిల్ అప్పీల్ కొట్టివేతకు గురికావడం ఈ వ్యవహారంలో కీలక పరిణామాలు. మరోవైపు, డీసిల్టింగ్ అనుమతులను రద్దు చేయాలని కోరుతూ వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం గనుల శాఖకు లేఖ పంపింది. ఏప్రిల్ 25న జారీ చేసిన మూడు ప్రొసీడింగ్స్‌పై ఆగస్టు 11న తవ్వకాలను నిలిపివేయాలని ఆదేశించిన జాతీయ హరిత ట్రిబ్యునల్.. ఆగస్టు 21న ఆ మూడు ప్రొసీడింగ్స్ అన్నింటిపైనా తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు స్టే అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. సోమవారం (అక్టోబర్ 26న) సుప్రీంకోర్టు కేసు జాబితాలో అప్పీల్ 'డిస్మిస్డ్'గా నమోదవడంతో ఇసుక తవ్వకాల అనుమతులు, పర్యావరణ నిబంధనలు, ప్రభుత్వ తదుపరి చర్యలపై ఉత్కంఠ నెలకొంది. - కాకతీయ, తెలంగాణ బ్యూరో**

## సుప్రీంకోర్టులో తాజా పరిణామం

జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆగస్టు 11 నాటి ఉత్తర్వులో తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ లిమిటెడ్ ఈ డీసిల్టింగ్ పనుల ప్రాజెక్టు ప్రతిపాదక సంస్థగా వ్యవహరిస్తోందని, కాంట్రాక్టర్ల ద్వారా పనులు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. ఈ వ్యవహారానికి సంబంధించిన సుప్రీంకోర్టు అధికారిక కేసు జాబితాలో 2026 అక్టోబర్ 26న సివిల్ అప్పీల్ నంబర్ 13696/2026, డైరీ నంబర్ 61460/2026 నమోదయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ లిమిటెడ్ వర్సెస్ పూనెం రాములు తదితరుల కేసు స్థితిని 'ఓవర్ (డిస్మిస్డ్)'గా చూపించారు. సుప్రీంకోర్టులో అప్పీల్ డిస్మిస్ కావడం, అంతకుముందే జాతీయ హరిత ట్రిబ్యునల్ మూడు ప్రొసీడింగ్స్‌పై స్టే విధించడం, డీసిల్టింగ్ అనుమతుల రద్దు కోరుతూ కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదులు అందడం.. ఈ పరిణామాలతో మంగపేట ఇసుక వ్యవహారంపై తదుపరి చర్యలపై ఉత్కంఠ నెలకొంది. అనుమతుల పరిధిలో ఎంత ఇసుక తొలగించారు? ఎంత పరిమాణంలో రవాణా చేశారు? తవ్వకాలు నిలిచిపోయాయా? పర్యావరణ అనుమతులు, కాలుష్య నియంత్రణ మండలి పర్యవేక్షణకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? అనే ప్రశ్నలకు అధికారిక సమాధానాలు రావాల్సి ఉంది.

ఏప్రిల్ 25న జారీ చేసిన ప్రొసీడింగ్స్ నంబర్లు 1043/సాండ్/డీసిల్టేషన్/2026, 1044/సాండ్/డీసిల్టేషన్/2026, 1045/సాండ్/డీసిల్టేషన్/2026కు సంబంధించి స్టే పరిధిపై స్పష్టత అవసరమైంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 21న ట్రిబ్యునల్ మరోసారి విచారణ చేపట్టింది. మూడు ప్రొసీడింగ్స్‌లో అన్నింటినీ నిలిపివేశారా, లేక ఒక్కదానికే స్టే వర్తిస్తుందా అనే సందిగ్ధత ఏర్పడినట్లు గుర్తించింది. దీంతో మూడు ప్రొసీడింగ్స్ అన్నింటినీ తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది. ప్రతివాదులు తమ సమాధానాలు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వుతో మూడు అనుమతులపైనా స్టే అమల్లోకి వచ్చింది. డీసిల్టింగ్ అనుమతులపై న్యాయ పోరు కొనసాగుతున్న సమయంలోనే, మంగపేట మండలంలోని అకినేపల్లి మల్లారం, రమణక్కపేట, వాడగూడెం గ్రామాల్లో ఇసుక తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని కోరుతూ పలు దరఖాస్తులు వచ్చినట్లు ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం 2026 మే 20న జారీ చేసిన లేఖలో పేర్కొంది. ఆర్‌సీ నం. సీ2/276/2026గా ఉన్న ఈ లేఖను గనులు, భూగర్భ వనరుల శాఖ సహాయ సంచాలకుడికి పంపారు. ఆదివాసీ నవ నిర్మాణ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, పాయం శ్రీనివాస్‌రావు తదితరులు, మనయసీమ పరిరక్షణ సమితి, మంచర్ల మురళి తదితరులు, కొమరం రామ్మూర్తి, కందిమళ్ల బుచ్చి లింగయ్య పేర్లతో వచ్చిన దరఖాస్తులను ఇందులో ప్రస్తావించారు. డీసిల్టింగ్ వల్ల భూగర్భ జలాలు తగ్గిపోవచ్చని, పర్యావరణానికి నష్టం కలగవచ్చని దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేసినట్లు లేఖలో ఉంది. ఇసుక తవ్వకాల నిబంధనలు-2015 ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుని, అమలు నివేదిక సమర్పించాలని కలెక్టర్ కార్యాలయం సూచించింది.

**మూడు ప్రొసీడింగ్స్‌పైనా స్టే**

**డీసిల్టింగ్ పనులకు పర్యావరణ అనుమతి అవసరమా అనే అంశాన్ని ట్రిబ్యునల్ తన ఆగస్టు 11 నాటి ఉత్తర్వులో ప్రస్తావించింది. పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్–2006లోని అనుబంధం తొమ్మిదిలో ఆరవ అంశం కింద డ్యాంలు, రిజర్వాయర్లు, వాగులు, బ్యారేజీలు, నదులు, కాలువల్లో నిర్వహణ, సంరక్షణ, విపత్తు నిర్వహణ కోసం పూడిక తొలగింపును పేర్కొన్నట్లు వివరించింది. అయితే, 'నోబుల్ ఎం. పైకడా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ, ఈ మినహాయింపు నిబంధనను రద్దు చేసిన విషయాన్ని ట్రిబ్యునల్ పేర్కొంది. సంబంధిత కార్యకలాపాలకు ముందు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి సమాచారం ఇవ్వడం, పర్యావరణ రక్షణ చర్యల అమలును పర్యవేక్షించడం వంటి అంశాలనూ ఉత్తర్వులో వివరించింది. ఈ నేపథ్యంలో మంగపేటలో అనుమతులు జారీ చేసే సమయంలో ఏ పర్యావరణ నిబంధనలు పాటించారు? కాలుష్య నియంత్రణ మండలి పర్యవేక్షణ ఉందా? అవసరమైన అధ్యయనాలు నిర్వహించారా? అనే అంశాలపై స్పష్టత అవసరమవుతోంది.**

**పర్యావరణ అనుమతులపై ప్రశ్నలు**



చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్ దక్షిణ మండలి 2026 ఆగస్టు 11న ఈ కేసును విచారించింది. సీతమ్మసాగర్ ప్రాజెక్టు కోసం ఏప్రిల్ 25న జారీ చేసిన అనుమతులను పిటిషనర్లు సవాల్ చేశారు. పర్యావరణ అనుమతి లేకుండానే గణనీయమైన పరిమాణంలో ఇసుకను తొలగించినట్లు పిటిషనర్లు ఆరోపించారు. దీనిపై స్పందించిన ట్రిబ్యునల్.. సంబంధిత ప్రొసీడింగ్స్ ప్రకారం చేపడుతున్న ఇసుక తవ్వకాలను తదుపరి విచారణ తేదీ వరకు తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసి, తమ సమాధానాలు దాఖలు చేయాలని సూచించింది. ఈ దశలో పర్యావరణ అనుమతుల అంశం, డీసిల్టింగ్ పనులకు వర్తించే నిబంధనలు, తవ్వకాల చట్టబద్ధతపై విచారణ కొనసాగింది.

**ఆగస్టు 11న తవ్వకాలు నిలిపివేత**

### 12 కోట్ల క్యూబిక్ మీటర్లకు ఎస్టిమేషన్..!

ములుగు జిల్లాలో ఇసుక తవ్వకాలకు సంబంధించి 12 కోట్లకు ఎస్టిమేషన్ జరిగింది.. 3కోట్ల క్యూబిక్ మీటర్లకు కొంత పర్మిషన్ ప్రాసెస్ జరిగింది. ఒక కోటి క్యూబిక్ మీటర్లకు ఫైనల్ ప్రోసిడింగ్స్‌కు వచ్చాయి. సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు కోసం ములుగు జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి ఇసుక కమిటీ చైర్మన్ 2026 ఏప్రిల్ 25న మూడు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. సుమారు 98.42 లక్షల ఘనపు మీటర్ల ఇసుక డీసిల్టేషన్ అనుమతులపై ట్రిబ్యునల్ స్టే విధించింది. ఇసుక డీసిల్టింగ్‌కు అనుమతి ఇచ్చినట్లు జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆగస్టు 11 నాటి ఉత్తర్వులో పేర్కొంది. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు ముంపు ప్రాంతంలో పేరుకుపోయిన ఇసుకను తొలగించడం కూడా ఈ అనుమతుల్లో భాగంగా ఉంది. ప్రాజెక్టు పరిధిలో ములుగు జిల్లాలో 55 చదరపు కిలోమీటర్ల మేర భూభాగం ముంపునకు గురవుతుందని అదే ఉత్తర్వులో ప్రస్తావించారు. ఈ అనుమతులను సవాల్ చేస్తూ పూనెం రాములు, ఇతరులు జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో ఒరిజినల్ అప్లికేషన్ నంబర్ 105/2026 (ఎస్‌జెడ్) దాఖలు చేశారు. ఇంత భారీ పరిమాణంలో ఇసుక తొలగింపునకు ఇచ్చిన అనుమతులు పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? పర్యావరణ అనుమతులు అవసరమా? అనే అంశాలు విచారణలో కీలకంగా మారాయి.